క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి నామినేషన్

పీలేరు : పీలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా గురువారం చింతల రామచంద్రారెడ్డి నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గురువారం ఉదయం స్థానిక ఆర్యవైశ్య కల్యాణమండపం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ర్యాలీ అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నామినేషన్ దాఖలు చేయనున్నట్లు చెప్పారు.

ఎస్ఈబీ స్టేషన్ తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్ఈబీ డిప్యూటీ కమిషనర్ టి.విజయ్‌శేఖర్.

ములకలచెరువు : స్థానిక ఎస్ఈబీ స్టేషన్‌ను అనంతపురం జోన్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) డిప్యూటీ కమిషనర్ టి.విజయ్‌శేఖర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... నాటుసారా తయారి స్థావరాలపై దాడులు తీవ్రం చేయాలని, కర్ణాటక మద్యం రవాణాను అరికట్టాలని సూచించారు. పాత నేరస్థులపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించారు. సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సీఐ రామమోహన్, సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

విజేతలకు బహుమతులు



బహుమతి అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మాధవ్

మదనపల్లె సిటీ : ఏఐఎస్ఎఫ్ నిర్వహించిన ఎంసెట్ మోడల్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బుధవారం బహుమతులు అందజేశారు. స్థానిక వికాస్ జూనియర్ కాలేజీలో జరిగిన సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మాధవ్ మాట్లాడుతూ విద్యార్థులకు మోడల్ ఎంసెట్ పరీక్ష ఎంతోగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థుల్లో భయం పోగొట్టి మంచి మార్కులు సాధించడానికి అవకాశమన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు మురళీకృష్ణ, భవిత, కమలాకర్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి



విద్యార్థి చరిషిత్‌రెడ్డికి నగదు బహుమతి అందజేస్తున్న హెచ్‌ఎం సుబ్బారెడ్డి

మదనపల్లె సిటీ : విద్యార్థులు మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పాఠశాలలో పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ సాధించిన విద్యార్థులకు ఉపాధ్యాయులు ఆర్.వి.రమణ,విజయలక్ష్మి,ఎన్జీ విజయలక్ష్మి, జుబేదా, ఉమామహేశ్వరిలు రూ.28 వేలు ప్రోత్సాహక నగదును అందజేశారు. ఒక్కో విద్యార్థికి రూ.1116 అందజేయడం జరిగింది. పాఠశాలలో 54 మందికి 500 మార్కులుపైగా సాధించారన్నారు. విద్యార్థులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో నగదు బహుమతిని అందజేసినట్లు చెప్పారు.

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రమేష్‌రెడ్డి

పీలేరు : ఎండలు మండుతుండడంతో వడదెబ్బ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. బుధవారం తలపుల పీహెచ్‌సీ పరిధిలోని గాండ్లపల్లెలో ప్రజలకు వడదెబ్బపై అగాహన కల్పించారు. గుండె, అధిక రక్తపోటు, మధుమేహం, మానసిక సమస్యలు ఉన్న వారు, చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఒంటిలో నీటిశాతం తగ్గకుండా వివిధ ద్రవ ఆహారాలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఈ కొండయ్య, ఆరోగ్య సిబ్బంది రేణుక, రాజేశ్వరి, వెంకటరత్నం, సుధ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసం.. నామినేషన్ పర్వం

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నిసార్‌అహ్మద్ నామినేషన్ దాఖలు
- తరలివచ్చిన అభిమాన జనవాహిని





నామినేషన్ కార్యక్రమానికి తరలివచ్చిన జనవాహిని, ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి

మదనపల్లె : వైఎస్సార్ సీపీ మదనపల్లె ఎమ్మెల్యే అభ్యర్థిగా నిసార్‌అహ్మద్ నామినేషన్ పర్వం ఆద్యంతం అట్టహాసంగా సాగింది. వేలాదిమందిగా తరలివచ్చిన అశేష జనవాహిని, అభిమానుల కేరింతలు, కోలాహలం నడుమ నిసార్ అహ్మద్ నామినేషన్ దాఖలు చేశారు. ప్రభుత్వ ఉద్యోగిగా స్వచ్ఛంద పదవీవిరమణ చేసి, ప్రజాసేవలో భాగంగా మైనారిటీ కోటాలో వైఎస్సార్ సీపీ అభ్యర్థిత్వాన్ని దక్కించుకున్న నిసార్‌అహ్మద్ నామినేషన్ దాఖలు చేయడం, ఇప్పటివరకు నామినేషన్లు వేసిన వారిలో ఈయనే ఉన్నతవిద్యావంతుడు కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. నామినేషన్‌లో పాల్గొనేందుకు నియోజకవర్గంలోని నిమ్మనపల్లె, రామసముద్రం, మదనపల్లె రూరల్, అర్బన్ నుంచి కనీవినీ ఎరుగని రీతిలో నేల ఈనినట్లు జనం తరలివచ్చారు.బుధవారం ఉదయం 10 గంటలకు బెంగళూరు బస్టాండులో ఏర్పాటుచేసిన ప్రచార రథంపై నుంచి ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్ అహ్మద్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి, ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్‌లు జింకాచలపతి, ఉదయ్‌కుమార్‌లు ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. బెంగళూరుబస్టాండ్, అవెన్యూరోడ్, టౌన్‌బ్యాంక్ సర్కిల్ మీదుగా చిత్తూరుబస్టాండ్ వాల్మీకిసర్కిల్‌కు చేరుకున్నారు. ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం పార్టీ అభ్యర్థి నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి, జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి, బండపల్లిఅక్కులప్పతో కలిసి సబ్‌కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన నామినేషన్ కేంద్రానికి చేరుకున్నారు. అక్కడ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ హరిప్రసాద్‌కు నామినేషన్ పత్రాలు సమర్పించారు. నామినేషన్ ప్రక్రియ పూర్తయ్యేవరకు ఆర్డీఓ కార్యాలయానికి 200 మీటర్ల దూరంలో చిత్తూరుబస్టాండ్ వద్ద మండుటెండలో జనాలు వేచి ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు దండుకరుణాకర్‌రెడ్డి, వెలుగుచంద్ర, ఆనందపార్థసారధి, బి.శశాంక్‌రెడ్డి, వరపన కిరణ్, తట్టిశ్రీనివాసులురెడ్డి, డాక్టర్.అనిల్‌కుమార్‌రెడ్డి, తట్టినాగరాజరెడ్డి, దండుకృష్ణారెడ్డి, లియాఖత్‌అలీ, సిలార్‌సాబ్, ముబషీర్‌అహ్మద్, ఎన్.మస్తాన్‌ఖాన్, ఇర్ఫాన్‌ఖాన్, గుండ్లూరురఫీ, దండాలరవిచంద్రారెడ్డి, ఎస్.ఏ.కరీముల్లా, పాల్‌బాలాజీ, సురేంద్ర, కోటూరిఈశ్వర్, పోతబోలునాగరాజ, కత్తిరాజు, బావాజాన్, మునిశేఖర్, వైఎస్సార్ సీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పట్టణంలోని 11, 12 వార్డుల నుంచి మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి, కురవంక సర్పంచ్ చిప్పిలి చలపతి, వైఎస్సార్ సీపీ నాయకులు దేశాయ్‌జయదేవ్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో వేలసంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు నామినేషన్ కార్యక్రమానికి హాజరయ్యారు. ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం ర్యాలీలో డ్యాన్సులు వేస్తూ...కార్యకర్తలను ఉత్సాహపరచడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఆశీర్వదించండి.. అత్యధిక మెజార్టీ అందించండి..

అందరికీ అందుబాటులో ఉంటా..సమస్యలు వింటా.. వాటి పరిష్కారానికి శాయశక్తులా కృషిచేస్తా... ఆశీర్వదించండి..అత్యధిక మెజార్టీని అందించండంటూ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్ ప్రజలను అభ్యర్థించారు. పేద,బడుగు,బలహీనవర్గాల సంక్షేమానికి గడచిన ఐదేళ్ల ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేసిందని, అవి కొనసాగాలంటే మరోసారి ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి ఎంపీ మిథున్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా తనను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు.

ఫ్యాన్‌కు పట్టం కట్టడమే ప్రజల ఆకాంక్ష..

రాష్ట్రంలో మే 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఫ్యాన్‌కు పట్టం కట్టడమే ప్రజల ఆకాంక్ష అని మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఫ్యాన్ గాలే వీస్తోందని, రాజంపేట హ్యాట్రిక్ ఎంపీ అభ్యర్థిగా మూడోసారి మిథున్‌రెడ్డిని, మదనపల్లె ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించుకునేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. మండుటెండను కూడా లెక్కచేయకుండా నిసార్‌అహ్మద్ నామినేషన్‌కు తరలివచ్చిన వేలాదిమంది ప్రజలే ఇందుకు నిదర్శనమన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు గడువు పెంపు

పీలేరు రూరల్ : ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షకు ఫీజు చెల్లించడానికి ఈ నెల 30వ తేదీ వరకు గడువు పెంచినట్లు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వై. వెంకటరెడ్డి తెలిపారు. ఇదివరకు ఫీజు చెల్లింపునకు బుధవారం దాకా గడువు ఉండేదన్నారు. అయితే విద్యార్థుల సౌకర్యార్థం 30వ తేదీ వరకు గడువు పెంచినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత



భక్తులకు అన్నదానం చేస్తున్న రమేష్‌కుమార్

బి.కొత్తకోట : ఆధ్యాత్మికతతో ప్రశాంతత లభిస్తుందని కర్ణాటక మాజీ స్పీకర్ రమేష్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక సత్యసాయిబాబా ఆధ్యాత్మిక కేంద్రంలో సత్యసాయి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టపర్తి ఆధ్యాత్మిక కేంద్రంగా వర్ధిల్లిందని అన్నారు. సత్యసాయితో ఉన్న అనుబంధాన్ని గుర్తుకు చేసుకున్నారు. అనంతరం సత్యసాయి చిత్రపటానికి పుష్పాలతో నివాళులర్పించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాసరపురం కాంగ్రెస్ నాయకులు సంజయ్‌కుమార్‌రెడ్డి, వైద్యులు వివి.రెడ్డి, ఎస్. కృష్ణారెడ్డి, కేశవరెడ్డి, గాండ్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

డిగ్రీ తర్వాత ఉన్నత చదువులు సాగించాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఎస్వీయూ వైస్ చాన్సలర్ శ్రీకాంత్ రెడ్డి తదితరులు

కుర బలకోట : డిగ్రీ ఉన్నత విద్యకు, ఉపాధి,ఉద్యోగాలకు సరిపోతుందని అయితే డిగ్రీ తర్వాత దానికి అనుబంధంగా ఉన్నత చదువులు సాగించడం ఉత్తమమని తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ వి. శ్రీకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన అంగళ్లు సమీపంలోని విశ్వం డిగ్రీ కళాశాలలో కరస్పాండెంట్ ఎం. ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ సి. రఘునాథరెడ్డి నేతృత్వంలో జరిగిన అతిసరాగ 2కె24 వేడుకల్లో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం ఆయన మాట్లాడుతూ అవకాశాలను అందిపుచ్చుకుని ముందుకు సాగితే రాణించవచ్చన్నారు. డిగ్రీ చదివినా స్కిల్స్ లేకపోవడం వల్ల చాలా మందికి ఆశించిన ఉద్యోగాలు రావడం లేదన్నారు. డిగ్రీలో మేజర్, మైనర్ కోర్సులు కొత్తగా ప్రవేశపెట్టినట్లు చెప్పారు. ఇంటర్న్‌షిప్ ద్వారా నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీకామ్ విద్యా సంస్థల చైర్మన్, ఈసీ మెంబర్ నరేంద్రనాథ్ రెడ్డి, ఎంసీవీ విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణారెడ్డి, ఎస్వీవి డిగ్రీ కళాశాల చైర్మన్ సురేంద్రనాథ్ రెడ్డి, ఎస్వీ డిగ్రీ కళాశాల చైర్మన్ రామకృష్ణారెడ్డి, ఈశ్వర్‌రెడ్డితో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

వేసవిలో ఖైదీల సంక్షేమానికి చర్యలు



జైలర్‌తో మాట్లాడుతున్న జైళ్లశాఖ డీఐజీ రాజేశ్వరరావు

మదనపల్లె : వేసవితీవ్రత దృష్ట్యా సబ్‌జైలులోని ఖైదీల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జైళ్లశాఖ డీఐజీ రాజేశ్వరరావు తెలిపారు. బుధవారం మదనపల్లె స్పెషల్ సబ్‌జైలును, డీఎస్‌జేఓ వేణుగోపాల్‌రెడ్డితో కలిసి ఆయన సందర్శించారు. సబ్‌జైలు సూపరిండెంట్ రామకృష్ణయాదవ్‌ను ఖైదీలకు అందిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్న నేపథ్యంలో వేడి నుంచి ఉపశమనానికి మిద్దెపై కూలింగ్ పెయింట్ వేయాల్సిందిగా సూచించారు. రోజుకు రెండుసార్లు మజ్జిగ ఇవ్వడంతో పాటుగా, ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచాలన్నారు. వట్టివేరు చాపలను ప్రత్యేకంగా తెప్పించి, వాటిని నీటితో తడిపి చల్లదనం ఉండేలా చూడాలన్నారు.

స్ట్రాంగ్‌రూమ్ తనిఖీ



స్ట్రాంగ్‌రూమ్ భద్రతపై సూచనలిస్తున్న పోలీస్ పరిశీలకులు దిల్ నవాజ్‌అహ్మద్

మదనపల్లె : సాధారణ ఎన్నికలు–2024కు సంబంధించి పట్టణంలోని జెడ్పీహైస్కూల్‌లో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్‌రూమ్‌ను సార్వత్రిక ఎన్నికల పోలీస్ పరిశీలకులు దిల్ నవాజ్‌అహ్మద్ పరిశీలించారు. బుధవారం మదనపల్లెకు వచ్చిన ఆయన నేరుగా జెడ్పీ హైస్కూల్‌కి వెళ్లి స్ట్రాంగ్‌రూమ్ భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. భద్రతకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై పోలీస్ అధికారులకు పలుసూచనలు చేశారు. శాంతియుత వాతావరణంలో ప్రజలు ఓటుహక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో శాంతిభద్రతలపై ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తేవాలని, 8977946222 నంబర్లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ యువరాజు, తాలూకా సీఐ ఎస్.శేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 25 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

బి.కొత్తకోట : ఆదిత్య డిగ్రీ కళాశాల చివరి ఏడాది విద్యార్థులకు బుధవారం నిర్వహించిన క్యాంపస్ ఎంపికలో 25 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారని ప్రిన్సిపాల్ ఎల్.ప్రసాద్ తెలిపారు. బెంగళూరుకు చెందిన అల్‌ట్రస్టీ టెక్నాలజీ సంస్థ విద్యార్థులకు చేతిరాత, గ్రూప్ డిస్కషన్, హెచ్‌ఆర్‌పై పరీక్ష నిర్వహించారు. కంపెనీ హెచ్‌ఆర్‌లు ప్రియాంక, అనిల్‌కుమార్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు రాజేంద్ర, లోకేష్ పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 12మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు.

పీలేరురూరల్ : స్థానిక ఎంజేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 12 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు కళాశాల చైర్మన్ ఎం.పి. అవినాష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం ధనుంజయ ఎంటర్‌ప్రైస్ లిమిటెడ్ ప్రతినిధి ధనుంజేయ ఆధ్వర్యంలో 39 మంది విద్యార్థులు రాత పరీక్ష రాశారు. అనంతరం నిర్వహించిన ఇంటర్వ్యూలో 12 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు వివరించారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ స్టాఫ్ చంద్రశేఖర్, వీణాగ్రేస్, ఆశ్రియా భాను, తస్మియా తదితరులు పాల్గొన్నారు.

వెలుగు సేవలు ప్రశంసనీయం



బహుమతి అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి

మదనపల్లె సిటీ : వెలుగు ప్రత్యేక పాఠశాల సేవలు ప్రశంసనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజరెడ్డి అన్నారు.బుధవారం స్థానిక అమ్మచెరువుమిట్ట వద్దనున్న వెలుగు ప్రత్యేక పాఠశాల వార్షికోత్సవం జరిగింది. ఆమె మాట్లాడుతూ పాఠశాలలో ప్రత్యేక అవసరాల విద్యార్థుల కోసం ప్రత్యేకంగా పాఠశాల ఏర్పాటు చేసి సేవలు అందించడం అభినందనీయమన్నారు.అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వెలుగు సెక్రటరీ ఉదయమోహన్‌రెడ్డి, కన్వీనర్ భాగ్యలక్ష్మి, కౌన్సిలర్ ముబీనా తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి ఆశీర్వదించండి



బి.కొత్తకోటలో ఓటు అభ్యర్థిస్తున్న పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



కలకడలో ఓటు అభ్యర్థిస్తున్న జకియఖానం, ఇక్బాల్‌అహమ్మద్‌ఖాన్, తదితరులు



తంబళ్లపల్లె: ప్రజలను ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే సతీమణి కవితమ్మ



పీలేరు రూరల్: ఎన్నికల ప్రచారంలో పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి,శ్రీనాథరెడ్డి తదితరులు

బి.కొత్తకోట : తంబళ్లపల్లె నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలు కళ్లారా చూస్తున్నారని, ఎవరు మంచి చేశారో ఆలోచించి ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. బుధవారం బి.కొత్తకోట పట్టణంలోని పాళంవీధి నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. దర్గావీధి, సంతబజారువీధి, సాయిబాబా గుడి, ఆర్యవైశ్య బజారులో ప్రజలను కలుస్తూ ప్రచారం చేసారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేసి గెలిపించాలని, సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకోవాలని కోరారు. ప్రచారం నిర్వహిస్తున్న పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిని ప్రజలు సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల ముందు నుంచి నిత్యం ప్రజలతో గడుపుతూ వారి సమస్యలపై చర్యలు తీసుకుని పరిష్కరించామని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, కార్యక్రమాల ద్వారా బి.కొత్తకోట నగర పంచాయతీ ప్రజలకు రూ.120 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సిమెంటురోడ్లు అవసరమైన పల్లెలను గుర్తించారు. వీటికి రూ.70.35 కోట్ల వ్యయంతో 1,875 రోడ్లను నిర్మించామన్నారు. పెద్దతిప్పసముద్రానికి అధిక రోడ్లు కేటాయించి పనులు చేయించినట్లు చెప్పారు. రూ.70.35 కోట్లతో 223.11 కిలోమీటర్లతో 1,875 రోడ్ల పనులు చేపట్టగా 581 పనులకు చెందిన 64.65 కిలోమీటర్ల సిమెంటురోడ్ల పనులు పూర్తి చేయించినట్లు తెలిపారు. మిగిలిన 158.46 కిలోమీటర్ల సిమెంటు రోడ్ల పనులు సాగుతున్నాయన్నారు. ప్రజలపై ఉన్న ఇంటిపన్నుల భారం రూ.2 కోట్లు తొలగించి వెసులుబాటు కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాగొండ ఖలీల్, జెడ్పీటీసీ రామచంద్ర, జీవీ.రామకృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, రాయలసీమ రమేష్‌రెడ్డి, సబ్జి, ఫయాజ్, మోహన్‌బాబు, చిన్నికృష్ణ, సుధాకర్, రాజా, నాగరాజు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని అధిక మెజారిటీతో గెలిపించండి

కలకడ : ఆంధ్రప్రదేశ్ లో బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలు ఏకమైనా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియఖానం, రాష్ట్రమైనార్టీ కమి షన్ చెర్మన్ డాక్టర్ ఇక్బాల్‌అహమ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కలకడ పంచాయతీలో ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డు, దండుబీడు ఇందిరమ్మ కాలనీ, మార్కెట్‌యార్డ్ వీధుల్లో ప్రచారం నిర్వహించారు.ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం జకియాఖానం మాట్లాడుతూ ఈ ప్రభుత్వ హయాంలో మైనారిటీలకు సముచిత స్థానం లభించిందన్నారు. సంక్షేమం పథకాలు అమలయ్యాయని, అభివృద్ధి జరిగిందని అన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డిని అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవి, కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, సింగల్‌విండో అధ్యక్షుడు వెంకట్రమణారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు ముబారక్, సద్దాంహుస్సేన్, షావత్‌అల్లీఖాన్, కెఎస్‌మస్తాన్, జిలానీ, మహబూబ్‌బాషా, రవికుమార్, సుల్తానీ, కరీముల్లా,సలీం, అక్రం, అక్బర్‌బాషా, హసన్‌షా తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ,ఎమ్మెల్యే విజయం అందరి బాధ్యత

తంబళ్లపల్లె: నియోజకవర్గం మరింత అభివృద్ధి చేసేందుకు వైఎస్సార్‌సీపీని గెలిపించాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సతీమణి కవితమ్మ కోరారు. బుధవారం తంబళ్లపల్లె టౌన్‌లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. కరపత్రాలు పంపిణీ చేశారు.ఫ్యాన్‌గుర్తుకు ఓట్లు వేసి ఎంపీ అభ్యర్థిగా మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థిగా పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అనసూయమ్మ, సర్పంచ్ నీలూఫర్, మల్లయ్యకొండ చైర్మన్ మల్‌రెడ్డి, నాయకులు నరేంద్రరెడ్డి, కోటిరెడ్డి, షాదిక్, రామూర్తి, కరీమ్, జమాల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఎర్రసానిపల్లె పంచాయతీలో..

ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపుకోసం ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ముమ్మర ప్రచారం చేస్తున్నారు. బుధవారం ఎర్రసానిపల్లె పంచాయితీలో సర్పంచ్ సుగుణమ్మ ఆధ్వర్యంలో మూలపల్లె, ఎర్రమద్దివారిపల్లె, ఎర్రసానిపల్లె, వక్కావారిపల్లె, ఎగువముత్రవారిపల్లెల్లో ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంచి ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సురేంద్రనాథ్, సింగిల్‌విండో చైర్మన్ భార్గవరెడ్డి,మండల అభివృద్ధి చైర్మన్ నారాయణరెడ్డి, నాయకులు భద్ర, శంకర్‌రెడ్డి, కన్నెమడుగు రామక్రిష్ణారెడ్డి, మోహన్‌రెడ్డి, షాదిక్, రామూర్తి, జమాల్‌బాషా, కోటిరెడ్డి, చంద్రశేఖర్, పద్మనాభరెడ్డి లు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధిని చూసి ఆదరించండి

పీలేరు రూరల్ : ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని చూసి ఆదరించాలని పీలేరు, కేవీపల్లె మండలాల వైఎస్సార్‌సీపీ ఎన్నికల ఇన్‌చార్జి పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని అగ్రహారం పంచాయతీలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదేళ్లగా నియోవర్గ ప్రజల గురించి పట్టించుకోని మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డికి, ఆయన సోదరుడు నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డిలిద్దరికీ ఎన్నికల సమయంలో మాత్రమే నియోజకవర్గ ప్రజలు గుర్తుకొస్తారని విమర్శించారు. వారికి ప్రజలు తమ ఓటు ద్వారా గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు చూసి నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండే రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డిని, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి, ఎంపీటీసీ అమరనాథరెడ్డి, గరుడారెడ్డి, సురేష్‌రెడ్డి, రూపేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తిరునాల

వీరబల్లె (రాయచోటి టౌన్) : ఓదివీడు గ్రామంలో వెలసిన శ్రీ అభయాంజనేయస్వామి తిరునాలు అంగరంగ వైభవంగా జరిగింది. మంగళవారం ఉదయం స్వామి వారి ఆలయంలో ఆలయ ధర్మకర్త పోరుమావిళ్ల చలపతి ఆధ్వర్యంలో శ్రీ సీతారామ కల్యాణం వేదపండితులు నిర్వహించారు. అనంతరం రాత్రి స్వామి వారికి విశేష పూజలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేసి భక్తుల దర్శన ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం సాయికుమార్ రాజు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. చాందినీ బండ్లు, చెక్క భజనలు భక్తులను ఆకట్టుకున్నాయి.

స్వేచ్ఛగా ఓటేయండి

లక్కిరెడ్డిపల్లె : ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలంటూ రెవెన్యూ సిబ్బంది బుధవారం స్థానిక మూడు రోడ్ల కూడలిలో ఓటుహక్కుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐ సమ్మద్ ఖాన్ మాట్లాడుతూ మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కు ద్వారా ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఆర్ఓలు సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.